దేవుడా ఆటంకాలు చూడు..

- దెబ్బతిన్న మైదానం
- ఆటలకు ఇబ్బందులు
- పట్టించుకోని నాయకులు, అధికారులు



నిరుపయోగంగా క్రీడా సామగ్రి భద్రపరిచే గది



వర్షం నీటితో మైదానం

భీమునిపట్నం: భీమిలిలోని వుడా క్రీడామైదానంలో సమస్యలు తాండవిస్తున్నాయి. 1991లో తగరపువలసకు వెళ్లే మార్గంలో విశాలమైన ప్రాంతంలో మైదానాన్ని అప్పటి వుడా నిర్మించింది. భీమిలి పరిధిలోని భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల పరిధిల్లోను ఇదే పెద్ద మైదానం. ఇక్కడ అన్ని క్రీడల నిర్వహణకు మైదానంతో పాటు వీక్షకులు కూర్చోవడానికి గ్యాలరీ ఏర్పాటు, మంచినీటి కోసం బోర్‌వెల్, క్రీడా సామగ్రి భద్రపరుచుకోవడానికి ఓ గది ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి ఈ మైదానంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో ఆటల పోటీలు జరిగేవి. రాను రాను ఈ మైదానం శిథిలావస్థకు చేరుకుంది. గతుకులు, ఎగుడు దిగుడుగా మారడంతో క్రీడల నిర్వహణకు ఇబ్బందిగా మారింది. వర్షాలు పడితే నీరంతా మైదనంలో నిల్వ ఉండిపోతుంది. బోర్‌వెల్ కూడా పాడైంది. రెండేళ్ల క్రితం కొత్త మరుగుదొడ్లు జీవీఎంసీ ఏర్పాటు చేయగా..నిర్వహణ లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. అలాగే మైదానం చుట్టూ 2008లో రూ 2.లక్షలతో వాకింగ్ ట్రాక్ నిర్మించగా పలు చోట్ల గోతులు ఏర్పాడి. రాళ్లు తేలడంతో ఇబ్బందిగా మారింది.

గత ప్రభుత్వంలో రూ.20లక్షల మంజూరు

గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి క్రీడల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ కనబరచిన నేపథ్యంలో మైదానంలో మరమ్మతులకు ప్రభుత్వం రూ.20 లక్షలు కేటాయించింది. మైదానంలో వసతులు ఏర్పాటు చేశారు. రక్షణగోడ కొన్ని చోట్ల దెబ్బతినగా దానిని నిర్మించడం, పాడైన వాకింగ్ ట్రాక్‌కు మెరుగుపరచాలని అధికారులు భావించారు. ఇక పనులు ప్రారంభించాల్సిన సమయానికి ఎన్నికల కోడ్ అమలుకావడంతో పనులు నిలిచిపోయాయి.



వాకింగ్ ట్రాక్ మధ్యలో ఏర్పడ్డ గొయ్యి

చాలా ఇబ్బందులున్నాయి



ఆటలకు ఎంతో అనువుగా ఉన్న ఈ మైదానాన్ని అధికారులు సక్రమంగా పర్యవేక్షించకపోవడంతో నిరుపయోగంగా మారుతోంది. సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహించారు. దీంతో మైదానం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఆటలు ఆడుకునేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. –జరజాపు ప్రసాద్, భీమిలి

అధికారులు చర్యలు తీసుకోవాలి



మైదానంలో సదుపాయాలు కల్పించాలి. విద్యార్థులు, యువతీ, యువకులు క్రీడలు ఆడడానికి, శిక్షణలు పొందడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వాకింగ్ చేయడానికి వీలుగా లేదు. ట్రాక్ పాడై రాళ్లు లేలడంతో నడవలేని పరిస్థితులున్నాయి. అధికారులు స్పందించి మైదానాన్ని మెరుగుపరచాలి. –వై.సత్యనారాయణ, భీమిలి

త్వరలో మరమ్మతులు

మైదానంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. త్వరలోనే మరమ్మత్తులు చేస్తాం. రూ.20 లక్షలతో త్వరలో పనులు నిర్వహిస్తాం. గతంలో అంచనాలు వేసిన విధంగా పనులను నిర్వహిస్తాం. క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. –ఏ.సుమన్, పబ్లిక్ వర్క్స్ ఏఈ

చెట్ల నరికివేత



పీఎంపాలెం ఆర్ హెచ్ కాలనీలో నరికివేతకు గురైన చెట్లు

పీఎం పాలెం: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించాల్సిందిపోయి చెట్లను ఇష్టారాజ్యంగా నరికివేయడంపై పలువురు ఆందోళన వ్యక్తం చస్తున్నారు. ఆర్ హెచ్ కాలనీలో రెండు చెట్లను ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు.

హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి అరెస్టు

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీ పాత సామయ్యవలసలో తన భార్యతో చనువుగా ఉంటున్నాడనే అనుమానంతో ఒకరిపై హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసి మంగళవారం అరెస్టు చేసినట్టు పద్మనాభం పోలీసులు తెలిపారు. పాత సామయ్యవలస గ్రామానికి చెందిన రౌతు రమణ తన భార్యతో చనువుగా ఉంటున్నాడని ఇదే గ్రామానికి చెందిన కోన శ్రీనివాస్(22)పై అనుమానం పెంచుకున్నాడు. రౌతు రమణ ఈ నెల ఒకటో తేదీ రాత్రి ఎనిమిది గంటల సమయంలో కోన శ్రీనివాస్‌ను మద్యం తాగుదామని రమ్మని చెప్పాడు. అక్కడకు వెళ్లిన శ్రీనివాస్‌పై రమణ కత్తితో దాడి చేశాడు. గాయపడిన శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రౌతు రమణను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్టు సీఐ తెలిపారు.

క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో రాస పోలమాంబ



డ్రై ఫ్రూట్స్‌తో రాస పోలమాంబకు అలంకరణ

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస రాస పోలమాంబ అమ్మవారిని మంగళవారం అదే గ్రామానికి చెందిన పిల్లి పెద్దోడు, కోటమ్మ దంపతుల ఆర్థిక సహాయంతో జరపర పువ్వులు, జీడి పప్పు, బాదం, కిస్‌మిస్, ఖర్జూరం, చెర్రీస్‌లతో అలంకరించారు. అమ్మవారిని ఈ ప్రత్యేక అలంకరణలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తుపాకుల అప్పల రాసయ్య, రాసమ్మ దంపతులు భక్తులకు ప్రసాదాలు అందించారు.

భూలోక మాతకు 108 చీరలతో అలంకరణ



108 చీరల అలంకరణలో భూలోక మాత

మధురవాడ: శ్రావణ మాసం ఆఖరి మంగళవారం అమావాస్యను పురస్కరించుకుని జీవీఎంసీ 6వ వార్డు రేవళ్లపాలెంలో కొలువైన అమ్మల గన్న అమ్మ భూలోక మాతకు 108 చీరలు సమర్పించి విశేషంగా అంకరించారు. గ్రామ పెద్దలు, కమిటీ, భక్తులు సహాయంతో విశేష వస్త్రాలంకరణ సేవ, వేద మంత్రోచ్చారణలతో విశేష పూజలను అర్చకులు రావి రామ్మూర్తి శర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా రేవళ్లపాలెం, మధురవాడ పరిసర ప్రాంతాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి పూజలు నిర్వహించారు.

సేవా భావమే ప్రజా ప్రతినిధుల లక్ష్యం కావాలి



మాట్లాడుతున్న ఎంపి భరత్

కొమ్మాది: ప్రజలకు సేవ చేయడంలో ఉన్న సంతృప్తి ఎందులోనూ ఉండదని, సేవా భావమే చట్ట సభలకు ఎన్నికయ్య ప్రజా ప్రతినిధుల లక్ష్యంగా ఉండాలని ఎంపీ భరత్ అన్నారు. భారత పరిశ్రమ సమాఖ్య (సిఐఐ) అనుభంద యువజన విభాగం యంగ్ ఇండియన్స్ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దేశ ప్రజాస్వామ్యం బలోపేతం కావాలంటే యువత చట్ట సభల్లో ముఖ్యంగా పార్లమెంట్ పనిచేసే విధి, విధానాలను సభ్యులుగా ఎన్నికైన ప్రజా ప్రతినిధుల బాధ్యతలను అవగాహన చేసుకోవాలని సూచించారు.

గ్రామాల విలీనంతో ఎన్నో ప్రయోజనాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా

భీమునిపట్నం: భీమిలి పరిధిలోని గ్రామీణ ప్రాంతాలు జీవీఎంసీలో విలీనమైతే ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఇక్కడ తన క్యాంపు కార్యాలయం వద్ద భీమిలి రూరల్, ఆనందపురం, పద్మనాభం మండలాలకు చెందిన టీడీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులతో సమావేశమయ్యారు. భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయని అది అందుబాటులోకి వస్తే ఈ ప్రాంతాలన్నీ గొప్పగా అభివృద్ధి చెందుతాయన్నారు. ఇందులో భాగంగా భీమిలిలోని రోడ్లను త్వరలో విస్తరించనున్నామన్నారు.

జీవీఎల్ దృష్టికి జ్యూట్‌మిల్లు మారుపేరు కార్మికుల సమస్య



మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావుకు వినతి పత్రం అందిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లులో ఉన్న 400 మంది కార్మికుల మారుపేరు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరుతూ మిల్లు ఐక్యసంఘాల నాయకులు మంగళవారం మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావుకు వినతి పత్రం అందించారు. 15 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసిన కార్మికులకు మిల్లు యాజమాన్యం 1992లో వారసత్వ హక్కు కల్పించిందని అప్పట్లో కుమారులు, అల్లుళ్లు లేని వారు తమ హక్కును బయట వారికి ఇచ్చారన్నారు. అలా మొదలైన మారుపేర్ల సమస్య ఆధార్‌కార్డు రావడంతో మరింత పెరిగిందన్నారు. గతంలో మిల్లు యాజమాన్యం కార్మికుల నుంచి నోటరీ తీసుకుని నష్టపరిహారం, గ్రాడ్యుటీ చెల్లించారని ప్రస్తుతం ట్రస్ట్ బోర్డు వద్ద ఉన్న పీఎఫ్ చెల్లించడానికి మారుపేర్లు అడ్డంగా మారాయన్నారు. కేంద్ర ప్రభుత్వం దృష్టికి మారుపేర్ల సమస్య తీసుకువెళ్లి కార్మికులకు రావలసిన పీఎఫ్, పెన్షన్ వచ్చేలా కృషి చేయాలని కోరారు. జీవీఎల్‌కు వినతిపత్రం అందించిన వారిలో కాంగ్రెస్ కార్మిక సంఘం, ఏఐటీయూసీ, టీఎన్‌టీయూసీ నాయకులు జేవీ కైలాస్‌రెడ్డి, మునకాల ఆదినారాయణరెడ్డి, దల్లి అప్పలరెడ్డి, చిల్ల అప్పలసూరిరెడ్డి, సాడి అచ్చారావు, మద్దుల దేవుళ్లు, సాడి ఈశ్వరరావు, చిల్ల ఆదినారాయణరెడ్డి, తమ్మిన కూర్మారావు, గిడిజాల రమణ, బోర రామారావు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యలక్ష్మి ఆలయ భూముల అన్యాక్రాంతంపై ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న ఆలయ ట్రస్టీ శివ రామకృష్ణ

పద్మనాభం: మండలంలోని ఐనాడలోని రాజ్యలక్ష్మి అమ్మ వారి ఆలయ భూములు అన్యాక్రాంతంపై ఆలయ ట్రస్టీ మామిడి శివ రామ కృష్ణ, ప్రజలు సోమవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. రాజ్యలక్ష్మి అమ్మ వారికి సర్వే నంబర్5/2లో 7.32 ఎకరాల భూమి ఉందని ఆ ఫిర్యాదులో తెలిపారు. అమ్మ వారి ధూపదీప నైవేద్యాలు, ఉత్సవాలకు ఈ జిరాయితి మెట్టు భూమి కేటాయించారని తెలిపారు. ఈ భూమి గ్రామ సెటిల్ మెంటు రిజిస్టరు, అడంగళ్లలో రాజ్యలక్ష్మి అమ్మ వారి పేరు మీద ఉందని పేర్కొన్నారు. ఈ భూమిలో ఒక వ్యక్తి సిమెంటు రేకుల షెడ్డు వేశారని తెలిపారు. గతంలో కూడా ఇదే విధంగా రేకుల షెడ్డు వేయగా గ్రామస్తులు తొలగించారన్నారు. ఇదే వ్యక్తి అమ్మ వారికి చెందిన 30 సెంట్లు భూమిని అన్యాక్రాంతం చేసి వేరొక వ్యక్తికి అమ్మేశాడని తెలిపారు. రెవెన్యూ అధికారులు స్పందించి అమ్మ వారి ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని ట్రస్టీ మామిడి శివ రామ కృష్ణ కోరారు.

మద్యం షాపు వర్కర్లను కొనసాగించాలి

తగరపువలస: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విధులు నిర్వర్తిస్తున్న వారిని కొనసాగించాలని ఏపీ లిక్కర్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.సుధాకర్ డిమాండ్ చేశారు. ఆనందపురం మండలం వెల్లంకిలో మంగళవారం జరిగిన విశాఖ జిల్లా మద్యం దుకాణాల నిరుద్యోగ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరూ నిరుత్సాహ పడవద్దని ప్రభుత్వానికి సమస్యలు తెలిసేలా పోరాటం చేస్తామన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఇది రాష్ట్రంలో 1.75 లక్షల కార్మికుల సమస్య అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పాలకొల్లు కమల్, రాష్ట్ర నాయకులు కె.సుధాకర్, ఎండీ ఇస్మాయిల్ ఖాన్, కె.చంద్రరావు, కె.శ్రీనివాస్, తాతాజీ, భరత్, భవానీ శంకర్, జగన్, అంబేడ్కర్, భాస్కర్, చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు.

తీరంలో 'సుందరకాండ' సందడి



లొకేషన్‌లో నటుడు నారా రోహిత్

కొమ్మాది: భీమిలి – ఆర్‌కే బీచ్ తీర ప్రాంతాల్లో మంగళవారం షూటింగ్ సందడి నెలకొంది. సందీప్ పిక్చర్ ప్యాలస్ బ్యానర్‌పై నిమ్మలపూడి వెంకటేష్ దర్శకత్వం వహిస్తున్న సుందరకాండ అనే సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరించారు. నటుడు నారా రోహిత్ హీరోగా తెరకెక్కిస్తున్న ఈ సినిమాకు చిన్నపాల్ల సంతోష్, గౌతమ్‌రెడ్డి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.

స్వచ్ఛత పక్వాడాపై అవగాహన



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు

తగరపువలస: పరిశుభ్రత, నీటి సంరక్షణ, ఆరోగ్యం తదితర అంశాలకు సంబంధించి విద్యాశాఖ అమలు చేస్తున్న స్వచ్ఛతా పక్వాడాపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు బంగ్లామెట్ట పాఠశాలలో నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు, ఉపాధ్యాయుడు నరహరిశెట్టి రమేష్, బుగత మల్లిక అసెంబ్లీ సమావేశంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. వ్యక్తిగత, చేతుల పరిశుభ్రత తదితర అంశాలను తెలియజేశారు.

వీఎంఆర్‌డీఏ భూములను పరిరక్షించాలి



భీమిలిలో భూములను పరిశీలిస్తున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ భూములకు ఫెన్సింగ్ వేసి పరిరక్షించాలని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా భీమిలిలోని కొత్తవలస, నిడిగట్టు, కాపులుప్పాడ, పరదేశిపాలెం తదితర గ్రామాల్లో సంస్థకు చెందిన భూములను అధికారులతో కలిసి పరిశీలించారు. కొన్ని స్థలాల విషయంలో న్యాయపరమైన చిక్కులు ఉన్నప్పటికీ.. వాటిని అధిగమించే విషయంపై దృష్టి సారించాలని చెప్పారు. కాపులుప్పాడ గ్రామంలో ఉన్న చెరువు పునర్జీవానికి గల అవకాశాలను స్థానిక రెవెన్యూ అధికారులు, సిబ్బందితో చర్చించారు. ఈ క్షేత్ర స్థాయి పర్యటనలో ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, చీఫ్ అర్బన్ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, ప్రధాన ఇంజనీర్ భవానీశంకర్, ఎస్ఈ బలరామరాజు, కార్యనిర్వాహక ఇంజనీర్ మధు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులపై అవగాహన



దాకమర్రిలో వరిపొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

తగరపువలస: భీమిలి మండలంలోని దాకమర్రి, శింగనబంధ పంచాయతీలలో వరి పొలాలను వ్యవసాయశాఖ అధికారులు, రైతు శాస్త్రవేత్తలు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు వరిలో యాజమాన్య పద్ధతుల గురించి పలు సూచనలు చేశారు. వరి ఉడిచిన 25 రోజులకు 25 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ తప్పనిసరిగా వేయాలన్నారు. ఆకుముడత ఉధృతి ఎక్కువైతే నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా కారాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు వంతున లీటర్ నీటికి చేర్చి 200 లీటర్లు ద్రవణాన్ని పిచికారి చేసుకోవాలన్నారు. పొడతెగులు లక్షణాలు కనిపిస్తే నివారణకుగాను 400 మిల్లీలీటర్లు హెక్సా కొనజాల్ లేదా 200 మిల్లీ లీటర్ల ప్రొపికోనోజోల్‌ను 200 లీటర్ల నీటిలో చేర్చి పిచికారి చేయాలన్నారు. అనంతరం రైతులకు విత్తనోత్పత్తి పథకంపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రకృతి సాగులో ఉన్న వ్యవసాయక్షేత్రాలను కూడా సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి కొత్తూరు అప్పలస్వామి, భీమిలి ఏడీ విజయప్రసాద్, డీఆర్సీలు చదువుల సుబ్రహ్మణ్యం, హరికృష్ణ, వ్యవసాయాధికారులు సురేష్, బి.శివకోమలి, అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ కీటకశాస్త్ర విభాగ శాస్త్రవేత్తలు డాక్టర్ విశాలక్ష్మి, కొక్కిరాపల్లి వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ ఏబీఎం శిరీష, వీఏహోలు రేఖ, ప్రకృతి, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

రేపు కృష్ణాష్టమి ముగింపు వేడుకలు



శ్రీకృష్ణుని రథం వద్ద ఉత్సవ కమిటీ ప్రతినిధులు

తగరపువలస: దేశంలో మొదటి వీధి ఉత్సవం శ్రీకృష్ణాష్టమి అని త్రైత సిద్ధాంత భగవద్గీత ఆచార్య ప్రబోధ యోగీశ్వరస్వామి సేవాసమితి తాటితూరు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బోని రావణ అక్షయ్ అన్నారు. మంగళవారం స్థానిక తాటితూరు కూడలి మండపం శ్రీకృష్ణుని పల్లకి వద్ద ఆయన శ్రీకృష్ణాష్టమి విశిష్టతను తెలియచేశారు. శ్రీకృష్ణుడు చనిపోయిన రెండేళ్లకు కలియుగం ప్రారంభమైందన్నారు. భగవద్గీత పుట్టిన తరువాత శ్రీకృష్ణుడు సామాన్య మనిషి కాదని జ్ఞానులు గ్రహించారన్నారు. అప్పటి నుంచే శ్రీకృష్ణాష్టమి వేడుకలు ప్రారంభించారన్నారు. ఈ నెల 5న అంగరంగ వైభవంగా ఊరేగింపుతో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ముగుస్తాయన్నారు. కార్యక్రమంలో దేవీ ప్రసాద్, ఆదినారాయణ, బాలకృష్ణ, అప్పలనరసమ్మ, ఆదమ్మ తదితరులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ



మధురవాడ అప్ బ్రిడ్జి సమీపంలో సర్వీసు రోడ్డులో కింద పడిపోయిన నో పార్కింగ్ బోర్డు



మధురవాడ అప్ బ్రిడ్జి వద్ద గోడ పై నుంచి కిందకి వచ్చిన బోర్డు, ప్రవేశిస్తున్న ఆటోలు

మధురవాడ: విశాఖ నార్త్ జోన్ పరిధి పీఎంపాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ మూడు అడుగులు ముందుకు– ఆరు అడుగులు వెనక్కు అన్న చందంగా ఉంది. పత్రికల్లో వార్తలు ప్రచురితం అయినప్పుడు, ఉన్నతాధికారులు, నాయకులు పర్యటన ఉన్నప్పుడు రెండు మూడు రోజులు హడావుడి చేసి తర్వాత వాటి గురించి పట్టించుకునే పరిస్థితులు కనిపించడం లేదు. ఆగష్టు 12వ తేదీన సాక్షిలో 'ట్రాఫిక్ పద్మ వ్యూహం' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించి కొమ్మాది జంక్షన్, మధురవాడ అప్ బ్రిడ్జి, వుడా కాలనీ రోడ్డు, జీవీఎంసీ ఆఫీసు తదితర చోట్ల నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేశారు. కొద్ది రోజులు తర్వాత ఇవి అలంకార ప్రాయంగా మిగిలిపోయాయి. వీటి రక్షణ గురించి కూడా ఎవ్వరూ పట్టించుకునే పరిస్థితి లేదు. దీంతో మంగళవారం కొన్ని పడిపోగా, గోడలకు ఉండాల్సిన బోర్డులు కిందని కనిపించాయి. మరికొన్ని చోట్ల అలంకార ప్రాయంగా మిగిలిపోయాయి. వుడా కాలనీ రోడ్డు, మధురవాడ జీవీఎంసీ ఏరియా, అప్ బ్రిడ్జి పరిసరాల్లో ఈ బోర్డులు ఉన్న చోటో పదుల సంఖ్యలో వాహనాలు నిలుపుదల చేస్తున్నారు. ఇక పెద్ద దుకాణాలు, హోటల్స్, ఉన్న చోట అయితే వాటిని ఎవ్వరూ పట్టించుకునే పరిస్థితులు లేవు. ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నారు. కనీసం ఉన్నత స్థాయి అధికారులు అయినా తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సీనియర్ ఉద్యోగులను మార్గదర్శకంగా తీసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర జగదీశ్వరరావు

తగరపువలస: సీనియర్ ఉద్యోగులలో మంచిని మార్గదర్శకంగా తీసుకుని జూనియర్ ఉద్యోగులు పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు అన్నారు. మంగళవారం ఆనందపురం పీహెచ్‌సీలో ఉద్యోగ విరమణ చేసిన పర్యవేక్షక అధికారి పాట్టి సాంబమూర్తి సన్మానసభలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఉమావతి, వైద్యులు సమత, అప్పారావు, ఎం.గంగునాయుడు, షహనాజ్ సాధియా, స్వప్న, శోభారాణి, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

సమయానికి తెరవరు... అధికారులు ఉండరు



10.30 గంటలైనా తెరుచుకోని సచివాలయం



అధికారులు లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డులో సచివాలయాలు సమయానికి తెరవడం లేదు. తీసినా అధికారులు ఉండటం లేదు. దీనిపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వార్డుపరిధిలో కె.నగరపాలెం-1, కె.నగరపాలెం -2, కాపులుప్పాడ, నిడిగట్టు, చేపలుప్పాడ, జేవి అగ్రహారంలో సచివాలయాలు ఉన్నాయి. ఏ రోజు వెళ్లినా 11 గంటల వరకు సచివాలయాలు తెరుచుకోవడం లేదు. 11 తరువాత తెరిచినా అధికారులు మాత్రం ఉండటం లేదు. పనులు కోసం ఇక్కడకు వచ్చిన స్థానికులు వేచి చూసి తిరిగి వెళ్లిపోతున్నారు. దీంతో రెవెన్యూ, పలు సర్టిఫికెట్ల కోసం భీమిలి వెళ్లాల్సివస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వలంటీర్ వ్యవస్థ లేకపోవడంతో ఏదైనా సర్టిఫికెటు కావాలన్నా, లేక ఇతర ప్రభుత్వ పనులు చేయించుకోవాలన్నా ఇబ్బందులు పడుతున్నామని, తీరా సచివాలయానికి వెళ్లినా అధికారులు ఉండటం లేదని వాపోతున్నారు. మళ్లీ పాత రోజులు గుర్తుకువస్తున్నాయని.. చిన్న పనికి కూడా పదేసి రోజులు పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సచివాలయాలు సమయానికి తెరిచి, సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సింహాచలంకు ఘనంగా వీడ్కోలు



ప్రధానోపాధ్యాయుడు సింహాచలాన్ని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

భీమునిపట్నం: మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీహెచ్.సింహాచలం నాలుగు రోజుల క్రితం ఉద్యోగ విరమణ చేయగా ఆయనకు మంగళవారం పాఠశాల వద్ద వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో హిందీ ప్రేమీ మండలి అధ్యక్షులు గంటా నూకరాజు, నిర్వాహకుడు కృష్ణారావు పాల్గొన్నారు.